అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి

■ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, మార్చి 29:పేదరికంతో అనారోగ్యాల బారినపడి వైద్య కోసం ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం సహాయనిధి అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం సాయం కార్పొరేట్ దవాఖానలలో ఉచితంగా వైద్యం పొందేందుకు అనారోగ్యాలను దూరం చేసుకునేందుకు తోడ్పాటునందిస్తున్నదన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ ఓల్డ్ హఫీజ్‌పేట్‌కు చెందిన చందన రేఖకు అత్యవసర వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయం మంజూరు పత్రాన్ని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం తన నివాసంలో అందించారు. ఈ

బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం ఏ వ్యక్తి అనారోగ్యానికి కారణంగా ఉండొద్దన్నదే సీఎం సహాయనిధి లక్ష్యమని, ఎందరో అభాగ్యులు దీని ద్వారా ఆర్థిక సాయం పొంది తమ అనారోగ్యాలను దూరం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శ్రీనివాస్, కిరణ్, అక్కరావు, విమల, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాల్లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, జిల్లాలోని పార్టీ సీనియర్ నాయకులు సమావేశానికి హాజరువుతారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున సమావేశానికి హాజరై దిగ్విజయం చేయాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

■ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీ, బస్తీలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో శంభీపూర్‌కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. *– దుండిగల్, మార్చి 29*

బెల్టుషాపుపై దాడి

9.8 లీటర్ల మద్యం స్వాధీనం

దుండిగల్, మార్చి 29: మద్యం బెల్టుషాపుపై శుక్రవారం సూరారం పోలీసులు దాడులు నిర్వహించి రూ.4,793 విలువజేసే 9.8లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్ శుభాశ్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ శివాలయనగర్‌కు చెందిన కే.శివారెడ్డి అనే వ్యక్తి హమీద్‌బస్తీలో గత కొంతకాలంగా బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం పోలీసులు సదరు బెల్టు షాపుపై దాడులు నిర్వహించి తనిఖీ చేయగా.. 10 కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్ బీరు బాటిళ్లతోపాటు 16 ఆఫీసర్స్ ఛాయిస్ విస్కీ క్వార్టర్ బాటిళ్లు లభించాయి. మొత్తం 9.8 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

దుండిగల్, మార్చి 29:ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జూపిటర్ వాహనం నడుపుతున్న ఓ వృద్ధుడికి తీవ్రగాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సూరారం పోలీసులు తెలిపిన ప్రకారం...కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,నిజాంపేట్ విలేజ్ లోని సన్‌రైజ్ ప్లాటినం అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న ఎస్.వెంకటరమణ (67) జీడిమెట్ల ప్రాంతంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 27న వెంకటరమణ తన జూపిటర్ వాహనంపై గాజులరామారంలోని కైసర్‌నగర్ మీదుగా నిజాంపేట్‌లోని తన ఇంటి నుంచి జీడిమెట్లకు వెళుతున్నాడు. కైసర్‌నగర్ సమీపంలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్దకు రాగానే ఎదురుగా వేగంగా దూసుకువచ్చి గుర్తుతెలియని కేటీఎం డ్యూక్ ద్విచక్ర వాహనం వెంకటరమణను బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంకటరమణను నగరంలోని ఓ వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో క్షతగాత్రుడి కొడుకు అజయ్‌కుమార్ శుక్రవారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వార్థం కోసం పార్టీలు మారితే ప్రజలు నమ్మరు

■ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత కేఎం గౌరీశ్

■ మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరవేయడం ఖాయం

కుత్బుల్లాపూర్,మార్చి 29: పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలోనే వెన్నంటూ ఉంటూ పనిచేసినప్పుడే తగిన గుర్తింపు, ప్రజల్లో ఆదరణ ఉంటుందే తప్పా.. స్వార్థ ప్రయోజనాల కోసం నమ్మక ద్రోహం చేస్తే భవిష్యత్‌లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత కేఎం గౌరీశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో ఎనలేని సంక్షేమ పథకాలను అందించి, ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అపారమైన పరిపాలనను అందించిన మాజీ సీఎం కేసీఆర్ పరిపాలనను యావత్ తెలంగాణ ప్రజానీకం మరువలేనిదన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, నిరంతరం ప్రజలకు నిస్వార్థంగా సేవలందించినప్పుడే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఏలాంటి ఆందోళనకు గురికాకుండా జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మేడ్చల్–మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి బరిలో ఉన్న రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు తథ్యమని, మల్కాజిగిరి పార్లమెంట్‌లో గులాబీ జెండను ఎగురవేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. గడిచిన మూడు నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పరిపాలనపై ఆదిలోనే అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని, గత ప్రభుత్వానికి–ప్రస్తుత ప్రభుత్వానికి పరిపాలన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత కేఎం గౌరీశ్

మహిళ అదృశ్యం

నేరేడ్‌మెట్, మార్చి 29: మహిళ అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ సీబీఎన్ కాలనీలో నివాసం ఉంటున్న గృహిణి కేతావత్ అంజలి(21) ఈనెల 19న ఇంటి నుంచి బయటికి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, బంధువులు వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దాంతో వారు శుక్రవారం ఉదయం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేప ట్టారు. అయితే అంజలి గతంలోనూ రెండుసార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చిందని కుటుంబసభ్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

అంజలి(ఫైల్)

కేపీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 29: కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.గోవర్ధన్‌రెడ్డి రెండోసారి భారీ మెజార్టీతో విజయం సాధించాడు. కూకట్‌పల్లి కోర్టులో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బరిలోకి దిగిన గోవర్ధన్‌రెడ్డి 340 ఓట్లను సాధించాడు. సమీప ప్రత్యర్థి టి.పరమేశ్వర్ 126 ఓట్లు సాధించగా.. 214 ఓట్ల భారీ మెజార్టీతో గోవర్ధన్‌రెడ్డి విజయం సాధించాడు. ఉపాధ్యక్షుడిగా పి.నాగరాజు, ప్రధానకార్యదర్శిగా జె.రమేశ్, సంయుక్త కార్యదర్శిగా బి.యాదయ్య, కోశాధికారిగా ఎం.డి.ఖలీల్‌పాషా, గ్రంథాలయం కార్యదర్శిగా వి.శ్రీలత, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా అరుణకుమార్, మహిళా కార్యదర్శిగా ఎ.సదాలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా చంద్రమౌళి, జ్యోత్స్నాదేవి, నాగలక్ష్మి, పల్లవి, ప్రవీణ్‌రెడ్డి, రమేశ్, విజయ్‌కుమార్ విజయం సాధించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించిన అసోసియేషన్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

గోవర్ధన్‌రెడ్డి

నేరాల నియంత్రణలో ప్రతిఒక్కరి పాత్ర కీలకం

కుత్బుల్లాపూర్,మార్చి29 : శాంతియుత సమాజ నిర్మాణం కోసం నేరాలను నియంత్రించడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని పేట్ బషీరాబాద్ ఏసీపీ కె.రాములు అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి ప్రాంతానికి చెందిన అజైంట్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చి సుమారు రూ.2లక్షల విలువ చేసే ఏఎన్‌పీఆర్(ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపు పొందిన కెమెరా)ను పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ కె.రాములు మాట్లాడుతూ.. ఆధునాతనమైన పరిజ్ఞానంతో వినియోగంలోకి వచ్చిన ఏఎన్‌పీఆర్ కెమెరా ద్వారా దాదాపుగా 50 మీటర్ల దూరంలో కూడా నంబర్‌ప్లేట్‌ను ఆటోమెటిక్‌గా లోడ్ చేసుకొని వారికి సంబంధించిన పూర్తి బయోడెటాను తెలిపే కెమెరా అని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రస్తుతం జరుగుతున్న హిట్ అండ్ డ్రైవ్ కేసుతోపాటు అనుమానాస్పదంగా ఉన్న నంబర్‌ప్లేట్‌ల వాహనాలను త్వరితగతిన గుర్తించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. సహకారానికి కృషి చేసిన అజైంట్ ఫార్మా కంపెనీ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పేట్ బషీరాబాద్ ఎస్‌హెచ్‌ఓ విజయ్‌వర్ధన్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు ఏఎన్‌పీఆర్ సీసీ కెమెరాలను అందించిన గుండ్లపోచంపల్లి అజైంట్ ఫార్మా కంపెనీ ప్రతినిధి

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కొండాపూర్ ఫ్లైఓవర్‌పై ఇరువైపుల వాహనాలకు అనుమతి

కొండాపూర్, మార్చి 29 : ఐటీ కారిడార్‌లో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రయోగాత్మక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే మాదాపూర్ ఐకియా దగ్గర చేపట్టిన ట్రాఫిక్ డైవర్షన్ విజయవంతం కావడంతో మరో ముందడుగు వేస్తూ కొండాపూర్ – గచ్చిబౌలి మార్గంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. కొండాపూర్ నుంచి గచ్చిబౌలి వైపు ట్రాఫిక్ నియంత్రణను తగ్గించే పనిలో భాగంగా కొండాపూర్ ఫ్లైఓవర్‌పై ఇరువైపుల వాహనాలకు అనుమతిస్తున్నట్లు మాదాపూర్ జోన్ అడిషనల్ డీసీపీ శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్టీవో కార్యాలయం వద్ద ఫ్లైఓవర్‌ను ఆయన ఏసీపీ సత్యనారాయణ, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఫ్లైఓవర్‌పై ఇరువైపుల వాహనాలను ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అనుమతిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం యధావిధిగా ట్రాఫిక్ నియమాలు కొనసాగుతాయన్నారు. ఈ చర్యలు ట్రాఫిక్ అదుపులోకి వస్తే భవిష్యత్తులో యధావిధిగా కొనసాగించనున్నట్లు తెలిపారు.

కొండాపూర్ ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసు అధికారులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్/మాదాపూర్/కేపీహెచ్‌బీ కాలనీ/కొండాపూర్/దుండిగల్/అల్లాపూర్, మార్చి 29 : కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ అపర్ణ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7:30 నుంచి 8 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వినాయక్ రాథోడ్ తెలిపారు. అపర్ణాకాలనీ, వెంకటేశ్వరకాలనీ, దేవేందర్‌కాలనీ, మైకాస్టెల్లింగ్, అమర్‌రోడ్, సెంట్రల్ పార్క్ కమాన్ ఏరియాలో అంతరాయం ఉంటుందన్నారు.

మాదాపూర్‌లో..

మాదాపూర్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మై హోం 11 కేవీ ఫీడర్ అయ్యప్ప సొసైటీలో నారాయణ మెడికల్ కళాశాల, స్విమ్మింగ్ పూల్ రోడ్డు, సీజీఆర్ స్కూల్ వెనకాల వైపు, జీహెచ్ఎంసీ వాటర్ వర్క్స్ ఏరియాలో ఉదయం 6:30 నుంచి 7 గంటల వరకు, ఎస్‌బీఐ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో విష్ణు విస్తారా అపార్ట్‌మెంట్, చంద్రానాయక్ తాండా, తాండా ప్రభుత్వ పాఠశాల రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ, దోభీఘాట్ రోడ్డులో ఉదయం 8నుంచి 8:30 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు.

హఫీజ్‌పేట్..హఫీజ్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ రాజేందర్ తెలిపారు. 11కేవీ మార్కెట్ ఫీడర్ పరిధిలో ప్రేమ్‌నగర్ వెనకాల వైపు, రోలింగ్ మెడాప్స్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డు కుడి, ఎడమ వైపు ఉదయం 7 నుంచి 7:30 గంటల వరకు, వైశాలి నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో వైశాలి నగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీ ఎన్‌జీఓస్ కాలనీ ప్రాంతాల్లో 7:30 నుంచి 8 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగనున్నట్లు ఆయన తెలిపారు.

మాతృశ్రీ నగర్ ..మరమ్మతుల కారణంగా 11 కేవీ విశ్వాంభర 11 కేవీ ఫీడర్ పరిధిలోని మాతృశ్రీనగర్ కాలనీలో విద్యుత్‌కు అంతరాయం కలుగనున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. 11 కేవీ విశ్వాంభర ఫీడర్ పరిధిలో విశ్వాంభరకాలనీ, శిల్పా ఎవెన్యూ కాలనీలో ఉదయం 8:30 నుంచి 9 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో..

కేపీహెచ్‌బీ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ విద్యాసాగర్ తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు ఎమ్మార్వో ఆఫీస్, మీసేవా రోడ్డు, శివాలయం రోడ్డు, మహారాష్ట్ర బ్యాంకు, గ్లోబల్ ఎడ్జ్‌స్కూల్, ధనలక్ష్మి సెంటర్ వరకు. 7 నుంచి 7:30 గంటల వరకు హోలిస్టిక్ వైద్యశాల, చైతన్య బార్ అండ్ రెస్టారెంట్, చందనా బ్రదర్స్, సితారా హోటల్ ప్రాంతాల్లో, ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్, భువనవిజయం గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

వసంతనగర్‌లో..వసంతనగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 6 గంట నుంచి 6.30 గంటల వరకు వెంకటరమణ కాలనీ, గోకుల్ ప్లాట్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు గోపాల్‌నగర్, ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు ఎన్‌ఆర్ఎస్ఏ కాలనీ, టీసీబీసీఐడీ కాలనీ, భగత్ సింగ్‌నగర్ ఫేజ్, డైమండ్ హిల్స్, డ్రీమ్‌వ్యూ కాలనీ పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సత్యవాణి తెలిపారు.

కూకట్‌పల్లిలో.. కూకట్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు సుమిత్రానగర్, బాగ్‌అమీర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతుందని ఏఈ చైతన్య తెలిపారు.

కొండాపూర్‌లో...

కొత్తగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి ఉదయం 6:30 గంటల వరకు వసంత విల్లాస్, సంకల్ప్ అపార్ట్‌మెంట్స్, సైబర్ వ్యాలీ, సైబర్ విలేజ్, వరల్డ్ వన్ స్కూల్ పరిసరాల్లో, 7:30 నుంచి ఉదయం 8 గంటల వరకు సెంట్రల్ పార్క్ ఫేజ్ –2, కేఎంఆర్ ఎస్టేట్స్, గాయత్రి లేఅవుట్, మాధవహిల్స్, కాంతివనం ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

దుండిగల్‌లో...

33/11కేవీ బౌరంపేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సాంకేతిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7:30 నుంచి 8 గంటల వరకు, 11కేవీ కొకాకోలా ఫీడర్ పరిధిలోని సింహపురి కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, డాలర్‌డ్రీం విల్లాస్, కొకాకోలా గోదాం, గోకుల్ బృందావన్, గోకుల్ నందన్, నెస్ట్‌విల్లాస్, బావర్చిహోటల్, డీఆర్‌కే కాలేజ్, కేఎల్‌హెచ్ యూనివర్సిటీ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ బి.సాయికిరణ్ తెలిపారు.

అల్లాపూర్‌లో...

అల్లాపూర్ డివిజన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు విద్యత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.11/33కేవీ ఫీడర్ పరిధి ఎస్‌బీఐ బ్యాంక్‌కాలనీలో ఉధయం 6.30 నుంచి 7 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయనున్నారు. అలాగే అల్లాపూర్ ఫీడర్11కేవీ విష్ణు విస్తారా, ఎస్‌బీఐ బ్యాంక్ కాలనీ దోభీఘాట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఉదయం 8 నుంచి 8.30గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

జగద్గిరిగుట్ట, మార్చి 29 : కార్మికులు, ప్రయాణికుల దాహర్తి తీర్చడం అభినందనీయమని నేతలు అన్నారు. జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాపులో ఏర్పాటు చేసిన చలివేద్రాన్ని బీఆర్‌ఎస్ నేత జైహింద్ శ్రువారం ప్రారంభించగా.. రుద్ర అశోక్, మారయ్య, ఇందిరగౌడ్, దత్తాత్రేయ, శేషారెడ్డి, విగ్నేష్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

దుండిగల్, మార్చి 29: ఉత్తర ప్రదేశ్ నుంచి అల్లుడి ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దల్జీత్ సింగ్, సూర్జీత్‌కౌర్(38)దంపతులు మరో మహిళతో కలిసి ఈనెల 23న కుత్బుల్లాపూర్ సూరారం శ్రీరాంనగర్‌లో నివాసముంటున్న తమ అల్లుడు నవజ్యోత్‌సింగ్ ఇంటికి వచ్చారు. శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సూర్జీత్‌కౌర్ రాత్రి అయినా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో నవజ్యోత్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే సూర్జీత్‌కౌర్ స్వల్ప మతిస్థిమితంతో బాధపడుతుండటంతో అప్పుడప్పుడు ఇలా చేస్తుందని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సూర్జీత్‌కౌర్(ఫైల్)

టీడీపీ ఆవిర్భా వ దినోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 29:కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా స్వర్గీయ తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ సత్తార్, దీపక్, రాజా, శివసత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

కల్వారి టెంపుల్‌లో ప్రత్యేక పార్థనలు

- గుడ్‌ఫ్రైడ్ డే సందర్భంగా అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు
- ఆకట్టుకున్న క్రీస్తు శిలువ ప్రదర్శన

మాదాపూర్, మార్చి 29: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని మియాపూర్‌లోని కల్వారి టెంపుల్‌కు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో కల్వారి ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఏసు ప్రభువును శిలువపై వేలాడదీసిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. భక్తులు ఉపవాసం ఉంటూ క్రీస్తు ప్రార్థనల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఆసియాలోనే అత్యంత గుర్తింపు పొందిన కల్వారి మందిరానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కల్వారి నిర్వాహకులు భక్తుల భద్రతకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 నుంచి మొదలు కొని సాయంత్రం 6 గంటల వరకు నాలుగు ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దైవజనులు, కల్వారీ టెంపుల్ వ్యవస్థాపకుడు, డాక్టర్ పి. సతీశ్‌కుమార్ క్రీస్తు జననం, శిలువ ప్రదర్శనను గురించి వివరిస్తూ క్రీస్తు సందేశాలను భక్తులకు తెలియజేశారు. అనంతరం భక్తులు ఏసును స్తుతిస్తు శిలువ యాత్ర చేస్తూ ప్రార్థనలు చేశారు.

అలరించిన క్రీస్తు శిలువ ప్రదర్శన

భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు..

టెంపుల్‌లో భక్తులకు కల్వారి నిర్వాహకులు ప్రత్యేక స్టాల్స్‌తోపాటు వృద్ధులు, దివ్యాంగలకు ప్రత్యేక వాహనాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యం అందించారు. భక్తులకు భోజనం, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

అలరించిన క్రీస్తు శిలువ ప్రదర్శన...

ఏసుక్రీస్తు శిలువ ప్రదర్శన, క్రీస్తు జన్మనాటికను భక్తుల కండ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఏసు నామాన్ని స్తుతిస్తు భక్తులు ప్రార్థనలు చేశారు. క్యాండిల్ ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. మొత్తం నాలుగు సర్వీసులు ఏర్పాటు చేశారు. ఒక్కో సర్వీసులో 80 నుంచి 90వేల మంది భక్తులు పాల్గొన్నారు. 4 లక్షల మంది భక్తులను పలుచోట్ల నుంచి తరలివచ్చినట్లు నిర్వాహకుడు జైరాజ్ తెలిపారు.

భారీ భద్రతలో కల్వారీ..

భక్తులు సూదూర ప్రాంతాల నుంచి రావడంతో రద్దీ అధికమైంది. దీంతో కల్వారి నిర్వాహకులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల బందోబస్తుతోపాటు కల్వారి టెంపుల్ ఆధ్వర్యంలో 2వేల మందికిపైగా వలంటీర్లను ఏర్పాటు చేసి భక్తులు క్యూలైన్‌లో మందిరంలోకి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్, మియాపూర్ మెట్రో డిపో నుంచి కల్వారి మందిరం వరకు ఉచిత బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచారు.



కల్వారి టెంపుల్‌కు భారీగా తరలివచ్చిన భక్తులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, మార్చి29 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శుక్రవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో సుమధుర ఆర్ట్స్ అకాడమీ గురువులు శ్రావ్య మానస శిష్య బృందం కూచిపూడి, జానపద నృత్యాలతో అలరించారు. కళాకారులు నారాయణ అచ్యుత, అన్నమయ్య సంకీర్తనలు, ఏకదంతాయ, శ్రీమన్నారాయణ, కొలువైతివారంగా సాయి, గణేశవా పంచరత్న అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించగా, మేడారం జాతర, గుజ్జరి, చందనలో అంశాలను జానపద నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 29 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 15, వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 18, దొండ 19, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలుగడ్డ 27, కీరా 23, దోసకాయ 16, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 22, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 21, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చిబఠాని 55, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 180, వెల్లుల్లి 180, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతు బజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తాం : మంత్రి తుమ్మల

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 29 : మల్కాజిగిరిని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని, పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మంత్రి తుమ్మలతోపాటు జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.సునీతామహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్, సత్యంశ్రీరంగం, వెంకటేశ్వర్‌రావు, తూము వేణు, నాగిరెడ్డి, శేరి సతీశ్‌రెడ్డి, దినేశ్‌కుమార్, పుష్పారెడ్డి, లక్ష్మీ, ఆయా డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ సంఘాల నేతలు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలున్నారు.

ఆకట్టుకుంటున్న రామాయణ కల్పవృక్షం

మాదాపూర్, మార్చి 29: సంగీతం, నృత్య ప్రదర్శనలతో కళాకారులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని సీసీఆర్‌టీ క్యాంపస్‌లో భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, శంకరానంద కళాక్షేత్ర నాట్యారంభ, భృత్ సహకారంతో రామాయణ కల్పవృక్షం పేరిట సంగీత నాట్య కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి విచ్చేసి కళాకారిణి ఆనంద శంకర్ జయంత్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా శ్రీరామ నామం, ఎంత రుచి రా సంగీతానికి నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. ఈ కార్యక్రమం ఈనెల 31వ తేదీ వరకు జరగనున్నది. వినయ్ వారణాసి, వివేక్ సదాశివమండ్ ధ్రువ శ్రీరామ రక్ష, కథలు, సంగీతం, హనుమంతుడిపై పలు భక్తి పాటలు వంటివి జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి